నేడు ఆత్మీయ సమ్మేళనం

అడ్డగుట్ట: సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం సాయంత్రం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు.

వడ్డెర సంఘం అభ్యున్నతికి కృషి

అడ్డగుట్ట: తెలంగాణ వడ్డెర ఓబన్న చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులుగా తుకారంగేట్‌కు చెందిన గోగుల స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గోగుల స్వామిని నియమిస్తూ శుక్రవారం సమితి ప్రతినిధులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోగుల స్వామి మాట్లాడుతూ... అందరి సహకారంతో వడ్డెర సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించవద్దు

సనత్‌నగర్: సాంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించి భక్తుల ఆగ్రహానికి గురికావద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, బోనాల ఉత్సవాల వంటి పవిత్ర కార్యక్రమాల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కొత్త విధానాలకు తెరతీయవద్దని స్పష్టం చేశారు. వివిధ రకాల పేర్లతో భక్తుల నుంచి డబ్బు వసూలు చేసే విధానాలను మానుకోవాలన్నారు. పాత పద్ధతులనే పాటించాలని డిమాండ్ చేశారు. నూతన విధానాలు అమలు చేస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వం, అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జూనియర్ కాలేజీ కొత్త భవనం ప్రారంభం



బొల్లారం: బొల్లారంలో గ్లాండ్ ఫార్మా సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. గ్లాండ్ ఫార్మా ట్రస్టీ రఘురామన్, డీఐఈఓ కిషన్, ఇంటర్మీడియట్ బోర్డు డెప్యూటీ సెక్రటరీ యాదగిరి, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు స్కూల్ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ ముఖ్యతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా సంస్థల నిర్వాహకులు ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రవర్తనను పర్యవేక్షించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

హష్ ఆయిల్ పట్టి వేత.. ఇద్దరి అరెస్టు

అడ్డగుట్ట: హష్ అయిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ సమీపంలోని సిక్ విలేజ్ క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా హష్ అయిల్ రవాణా చేస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన రాజు, ముషీరాబాద్‌కు చెందిన ఎండి సోయాబ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 3లక్షల విలువ చేసే 91 గ్రాముల అయిల్, రెండు బైకులతో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఓయూ మోడల్ స్కూల్...

సమస్యలతో సతమతం

కాంట్రాక్టు అధ్యాపకులతో నడుస్తున్న పాఠశాల

- పట్టించుకోని వీసీ
- స్కూల్ స్పెషల్ ఆఫీసర్‌కు తీరికే లేదు



ఓయూ మోడల్ హై స్కూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న మోడల్ హైస్కూల్ పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. 52 ఏళ్ల క్రితం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోడల్ హైస్కూల్‌లో గతంలో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియాలలో 10వ తరగతి వరకు విద్యాబోధన జరిగింది. 25 ఏళ్లుగా నియామకాలు చేటపట్టనందున టీచర్ల కొరతతో మోడల్ హైస్కూల్ కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు 42 మంది పర్మనెంట్ టీచర్లు ఉండగా నేడు ఒక్కరు కూడా పర్మనెంట్ టీచర్లు లేరు. 12 కాంట్రాక్టు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత, ఇతర కారణాలవల్ల ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియానికి మాత్రమే స్కూల్ పరిమితమైంది. ఇదివరకు ఇక్కడ ఓయూ ప్రొఫెసర్లు, ఉద్యోగుల పిల్లలు చదివే వారు. ఇలా ఎంతో ఘన చరిత్ర గల 52 ఏండ్ల ఓయూ మోడల్ హై స్కూల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బలహీనపడింది. పాఠశాలలో మొత్తం 352 మంది విద్యార్థులున్నారు.ప్రతి సంవత్సరం 150 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటుండగా ఈ సంవత్సరం 50 మంది మాత్రమే వరకు చేరారు.

స్కూల్‌ను పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్

ఓయూ మోడల్ హైస్కూల్ పాలన వ్యవహారాలను క్యాంపస్‌లోని వర్సిటీ బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవీంద్రనాథ్ కె.మూర్తిని స్పెషల్ ఆఫీసర్‌గా వీసీ నియమించారు. కానీ ఆయనకు బీఈడీ, ఎంఈడీ తరగతుల బోధన, పరిశోధన, కాలేజీ పాలన వ్యవహారాలతో తీరకలేకుండా ఉండటంతో ఓయూ మోడల్ స్కూల్‌ను పట్టించుకోవడం లేదు. గతంలో స్పెషల్ ఆఫీసర్‌గా రిటైర్ ప్రొఫెసర్‌ను నియమించారు. దీంతో ఆయన స్కూల్ బాగోగులు పట్టించుకునే వారు. నాణ్యమైన విద్యను అందించిన ఓయూ మోడల్ స్కూల్ మూసివేసే దిశగా కొనసాగుతుంది. వీసీ ప్రొ.కుమార్ స్కూల్‌ను సందర్శించి అభివృద్ధి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రాంగోపాల్‌పేట: ఇస్కాన్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవం శుక్రవారం అత్యంత కన్నులపండువగా జరిగింది. అశేష భక్త జన వాహిని తరలిరాగా, సంప్రదాయ నృత్యాల నడుమ జగన్నాథస్వామి రథయాత్ర ముందుకు కదిలింది. జగన్నాథుడి నామస్మరణతో సికింద్రాబాద్ ప్రాంత రహదారులన్నీ మార్మోగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి నియామకం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం పాలక మండలి నూతన కమిటీ దేవాదయ శాఖ అధికారులు నియమించారు.13 మందితో కూడిన కొత్త కమిటీని శుక్రవారం ప్రకటించారు. ఆకుల భూలక్ష్మీ, మూల అమత్య, గోదాస్ ఉమారాణి, మిరియాల నవీన్ కుమార్, మహేష్, వి.హరి దేవరాయ చౌదరి, సురేష్ వర్మ, కె.రవిందర్, శ్రీధర్ కుమార్ గౌడ్, సి.సత్యనారాయణ, కె.శంకర్‌గౌడ్,బి.ఉమానాథ్‌గౌడ్,ఎం. భాస్కర్‌లను పాలక మండలి సభ్యులు నియమించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జులై 9న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును శుక్రవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జాయింట్ కమీషనర్ డాకు నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు.

ముస్లిం శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించండి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని ముస్లిం శ్మశానవాటికకు కేటాయించాలని సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అధికారులను కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు, ముస్లిం నాయకులతో కలిసి శనివారం ఆమె ఆ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో భేటి అయ్యి స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ఆలోచించాలన్నారు. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని చెప్పి తప్పించుకుతిరగకుండా స్థల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో ఇన్వెస్టిచ్యూర్ (నాయకత్వ బాధ్యతల స్వీకారోత్సవం) సెర్మనీ శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ వేడుకలకు పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు గుర్రాలపై నుంచి ఈక్వెస్ట్రియన్ బృందం ప్రదర్శన చూపరుల మది దోచుకుంది. పరేడ్ కమాండర్‌గా సెకండ్ ఆఫీసర్ కాత్రా రవి బాధ్యతవహించారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జే నోరియా పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

లాలాపేట: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పావని శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని తార్నాకలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కట్టడికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సూచించారు.

డిప్యూటీ కమిషనర్‌కు సమ్మె నోటీసు

బన్సీలాల్‌పేట్: దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహించనున్న సమ్మె నోటీసును శుక్రవారం సీఐటీయూ నాయకులు డిప్యూటీ కమీషనర్‌కు అందజేశారు. సీఐటీయూ నగర నాయకులు దశరథ్, సనత్‌నగర్ జోన్ కన్వీనర్ మల్లేష్, ఎం. అజయ్ బాబు, పరశురాములు తదితరులు కలిసి సమ్మె నోటీసును అందజేశారు. సిఐటీయూ నాయకులు దశరథ్, మల్లేష్, అజయ్‌బాబు తదితరులు మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

'ఊరి చివరి మనిషి' గ్రంథావిష్కరణ..

సనత్‌నగర్: రిటైర్డ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జుంటిపల్లి రాములు ఆత్మకథ అయిన 'ఊరి చివరి మనిషి' గ్రంథావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బేగంపేటలోని ఓ హోటల్‌లో గురువారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది హెచ్.సుధాకర్‌రావు, విశ్రాంత డీఎస్పీ రాములు, సినీనటుడు సుమన్ తదితరులు పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

చిలకలగూడ, వారాసిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురు అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

కుటుంబ కలహాల కారణంగా గృహిణి..

చిలకలగూడ: కుటుంబ కలహాల కారణంగా చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గృహిణి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. గోదావరిఖనికి చెందిన మౌనిక (24) సీతాఫల్‌మండిలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో చదువుతోంది. అమెజాన్ సంస్థలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న దూరపు బంధువు సంగీలెనిన్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యభర్తల మధ్య తగాదాలు నెలకొన్నాయి. ఈనెల 11న మౌనిక తన తండ్రికి ఫోన్ చేసి భర్త లెనిన్‌తో గొడవ జరిగిందని, తాను గోదావరిఖనికి వస్తానని చెప్పడంతో తండ్రి అంగీకరించాడు. అయితే మౌనిక సొంతింటికి చేరలేదు. దీంతో మౌనిక తండ్రి రాజమౌళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

బయటకు వెళ్లి తిరిగి రాని బాలిక

చిలకలగూడ : టిఫిన్ తెచ్చేందుకు బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. మెట్టుగూడకు చెందిన అర్చన (17) ఈనెల 26న టిఫిన్ పార్శిల్ తెచ్చేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్చన తన వెంట సెల్ ఫోన్‌ను తీసుకు వెళ్లలేదు. తల్లి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగం కోసం వెళ్లి యువకుడు..

బౌద్ధనగర్: కొత్త ఉద్యోగం వెతుక్కునేందుకు ఇంటి నుంచి బయటకి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ సునీత తెలిపిన మేరకు రాంనగర్ ప్రాంతానికి చెందిన మన్నెం మనికాంత్ (22)ఈ నెల 9న ఉద్యోగం కోసం ఇంటిబయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పేదల ఆకలి మీద 'పేర్ల' రాజకీయాలా?

అడ్డగుట్ట: అన్నపూర్ణ క్యాంటీన్ ను ఇందిరా క్యాంటీన్‌గా పేరు మార్చడానికి తీసుకున్న నిర్ణయాన్ని కార్పొరేటర్ సామల హేమ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 తరువాత పేదల ఆకలిని తీర్చాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అన్నపూర్ణ క్యాంటీన్లు నగరంలోని వలస కూలీలు, నిరుపేదలు, చిన్న ఉద్యోగస్తుల వద్ద మంచి పేరు సంపాదించాయని అన్నారు. పూటకు రూ.5కే మంచి నాణ్యతతో భోజనం అందిస్తున్న ఈ పథకం లక్షల మంది పేద, మధ్య తరగతి ప్రజల నిత్య జీవితంలో భాగమైంది అని గుర్తు చేశారు. పేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన అన్నపూర్ణ క్యాంటీన్ పథకానికి కొత్త రంగు అద్దె పనిలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ పడిందన్నారు. తాజా సమావేశంలో ఈ క్యాంటీన్లను 'ఇందిరా క్యాంటీన్లు'గా మారు పేరుతో నడిపే ప్రతిపాదనకు ఆమోదం తెలపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పించాలి



సనత్‌నగర్: క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని రకాల వసతులను కల్పించాల్సిందిగా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా బ్యాడ్మింటన్ కోర్టులో లైటింగ్ సరిగా లేదని, సిట్టింగ్ చైర్స్ ఏర్పాటుచేయాలని, అలాగే వర్షం పడినప్పుడు రూఫ్‌పై నుంచి నీరు కారుతున్నాయని పలువురు క్రీడాకారులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు క్రీడాకారులు ఎంతమంది వచ్చి సాధన చేస్తుంటారు..వారికి తగ్గ క్రీడా సామాగ్రి ఉన్నాయా లేవా అని అధికారులను ఆరా తీశారు.

మంచినీటి పైప్‌లైన్‌కు అడ్డుపడ్డ చెప్పు..

రెండు నెలలపాటు లోప్రెషర్ సమస్య

సనత్‌నగర్: ప్రతిరోజూ తాగే మంచినీరు సరఫరా అయ్యే పైపుల్లో కాలి చెప్పు దర్శనమివ్వడం విస్మయానికి గురిచేసింది. గత కొన్ని నెలలుగా పైపులో చెప్పు అడ్డుపడడంతో నీటి సరఫరాలో 'లో ప్రెషర్' ఉత్పన్నమై స్థానికులు నానా అవస్థలు పడుతూ వచ్చారు. ఈ పరిస్థితి బేగంపేట బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-3లోని వడ్డెర బస్తీలో నెలకొంది. ఇక్కడి లేన్‌నెంబర్-3లో 'లో ప్రెషర్' విషయంపై స్థానికులు వాటర్‌వర్క్స్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతల దృష్టికి తీసుకువచ్చినా అధికారులకు పరిష్కారం లభించలేదు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ వేర్వేరుగా ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో స్థానికులు ఇదే సమస్యపై మొరపెట్టుకున్నారు. చివరకు వారి ఒత్తిడి మేరకు వాటర్ వర్క్స్ అధికారులు తవ్వుకుంటూ లోతుగా సమస్యపై ఆరా తీశారు. చివరకు పైపులో చెప్పు అడ్డుపడినట్లు గుర్తించారు. చెప్పుతో పాటు ప్లాస్టిక్ కవర్లు కూడా ఉండడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. అసలు పైపులోకి చెప్పులు, ప్లాస్టిక్ కవర్లు ఏవిధంగా వచ్చాయన్నది ప్రశ్నార్థకం మారింది.